క్లుప్తంగా

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


రంజపల్లి ఉషారాణి, ఎంపీపీ

అరకులోయ రూరల్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 14 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రహదారులు, తాగునీటి పథకాలు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులు సత్వరంగా పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

కలప ముక్కలు పట్టివేత


పట్టుకున్న ముక్కలకు నెంబర్లు వేస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ జోగంపేటలో 14 గంధ్ర కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు పెదవలస రేంజర్ జగదీష్ బుధవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి తనిఖీలు చేయగా ముక్కలు లభ్యమైనట్టు చెప్పారు. చింతపల్లి స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. రాజేంద్రపాలెంలోను తనిఖీలు నిర్వహించామన్నారు. జోగంపేటలో స్వాధీనం చేసుకున్న గంధ్ర కలప ముక్కల విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. అనుమతులు లేని కలపను నిల్వ ఉంచినా అక్రమంగా తరలించినా చర్యలు తప్పవన్నారు.

ఆశీలు వసూలుకు వేలంపాట

చింతపల్లిరూర్: మండలంలో చింతపల్లి, లంబసింగి,లోతుగెడ్డ జంక్షన్,అన్నవరం, గ్రామలలో నిర్వహించు వారపు సంత ఆశీలు వసూలుకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 న ఉదయం 11 గంటలకు అన్నవరం, మధ్యాహ్నం 3 గంటలకు చింతపల్లి. 21 న ఉదయం 11 గంటలకు లోతుగెడ్డ జంక్షన్, 3 గంటలకు లంబసింగి వారపు సంతకు సంబంధించి ఆశీలు వసూలు వేలంపాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆశ్రమ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో 2024–25సంవత్సరానికి వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాలరాజు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతిలో–80సీట్లు, 4వ తరగతిలో–76సీట్లు, 5వ తరగతిలో–54సీట్లు, 7వ తరగతిలో–5సీట్లు, 8వ తరగతిలో–3సీట్లు, 9వ తరగతిలో–10సీట్లు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి వెంకటనగర్ కాలనీలో ఉన్న సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి హోమాలు, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నక్కపల్లి, కొత్తపేట, రాజీవ్‌నగర్‌కాలనీ, బండారు పేట, అప్పలపాయకరావుపేట తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

చిరుధాన్యాల సాగు.. లాభాలు బాగు

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- మార్కెట్‌లో గిరాకీ
- ఆశాజనకంగా ధరలు


జొన్నల పంట


ఏజెన్సీలో సాగులో ఉన్న రాగుల పంట

రాజవొమ్మంగి: ఆరోగ్యానికి తృణధాన్యాలు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రోజురోజుకు తృణధాన్యాల వినియోగం పెరుగుతూ వస్తోంది. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గతంలో ఏజెన్సీలో చిరుధాన్యాల సాగు ఎక్కువగా ఉండేది. రాను రాను వాణిజ్య పంటల సాగు ఎక్కువైంది. అయితే గడిచిన కొద్ది సంవత్సరాలుగా చిరుధాన్యాల వినియోగం మరలా పెరగడం, మార్కెట్ గిరాకీ వల్ల ఎక్కువ విస్తీర్ణంలో రాగులు, కొర్రలు, సామలు తదితర పంటలు పండిస్తున్నారు.

వాతావరణం అనుకూలం

వాతావరణ పరిస్థితులలోని అసమానతలను తట్టుకొనే చిరుధాన్యాల (తృణధాన్యాలు) సాగు ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు లేకపోయినా తృణధాన్యాలు ఎంతో సులువుగా పండుతాయి. ఏజెన్సీలో తొలకరి వర్షాల కంటే ముందుగానే రాగులు, గంటెలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. రైతులు పండించే తొలి పంట తృణధాన్యాలే. తొలకరి అరుదెంచగానే తిండి గింజలకోసం విరివిగా సాగవుతున్న పంట కేవలం వరి మాత్రమే. వరి పూర్తి పంటకాలం దాదాపు 120 రోజులు. అన్ని రోజుల పాటు ఆహార ధినుసుల కోసం ఎదురు చూడనవసరం లేకుండా 90 రోజుల కంటే ముందే చేతికి వచ్చే గంటెలు, రాగులు, జొన్నలు తదితర తృణధాన్యాలను రైతులు పండిస్తున్నారు. ఈ పంటల వల్ల ఆహారకొరత తీరడమే కాకుండా మంచి మార్కెట్ ఉండడంతో గిట్టుబాటు ధరలతో గిరిజన రైతులు లాభాలు పొందుతున్నారు. ఒకప్పుడు ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో రాగులు, సజ్జలు, జొన్నలు ప్రధాన ఆహారంగా వుండేవి. రాను రాను ఆ స్థానాన్ని గోధుమ, మైదా, వరి ఆక్రమించుకొంది. అయితే ప్రస్తుతం మార్కెట్ బాగుండడంతో చిరుధాన్యాల సాగు పెరుగుతూ వస్తోంది. వరి, గోధుమ వంటి ప్రధాన పంటల పరిశోధనలు పెరుగుతున్నా తృణధాన్యాలపై తగ్గుతున్నాయని పలువురు చెబుతున్నారు. రైతులకు చిరుధాన్యాల సాగుపై సూచనలు, సలహాలు అందిస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో గిరిజన రైతులు పండించే అవకాశముంటుందని పలువురు చెబుతున్నారు.


సాగులో ఉన్న కొర్రల పంట

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం

అల్లూరి జిల్లాలో జొన్న ప్రస్తుతం 80 ఎకరాల్లో , గంటెలు/ సజ్జలు 90 హెక్టార్లలో సాగులో ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. మొక్కజొన్న (మెయిజ్)–1,833 హెక్టార్లలో, రాగులు–13,922 హెక్టార్లలో, కొర్రలు 68 హెక్టార్లలో, సామలు 1, 753 హెక్టార్లలో సాగులో ఉన్నట్టు లెక్కలు చెపుతున్నాయి. తృణధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు.

ఏజెన్సీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరరావు

అరకులోయ రూరల్: పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఉపాధ్యాయుల సంఘం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వర రావు తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో బుధవారం యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు అరకులోయ బహిరంగ సభలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న అన్ని శాఖల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు, గిరిజన హక్కులు చట్టాలను సక్రమంగా అమలు జరిగేటట్లు చూడలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకే నూరుశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హమీలన్నీ అమలుచేయాలన్నారు. నాయకులు చిట్టిబాబు, ధర్మరావు, దేముడు,శెట్టి బాలకృష్ణ, సతీష్, ఆనంద్, రాజు, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. అమ్మవారిని పసుపు కుంకుమలు, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

కొర్రాజుల జాతరకు సర్వం సిద్ధం

- కొండరెడ్లు, నాయకపోడుల ఆధ్వర్యంలో వేడుకలు
- పది రోజులపాటు జరగనున్న ఉత్సవాలు


ఘటాల ఊరేగింపులో భక్తులు (ఫైల్)


కొలువుదీరిన అమ్మవార్ల గద్దె

వీఆర్ పురం: రేఖపల్లి చెరువు సమీపంలో పోతురాజు గద్దె వద్ద ప్రతీ మూడేళ్ల కొకసారి నిర్వహించే కొర్రాజుల జాతరను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు జాతర కమిటీ సభ్యులు గత వారం రోజుల నుంచి ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నారు. శనివారం రాత్రి ముత్యాలమ్మకు ముడుపులు కట్టి జాతర పనులను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ నెల 18 వ తేదీ వరకు సుమారు పది రోజుల పాటు కొనసాగే ఈ జాతర చివరి రోజు అగ్ని గుండం తొక్కడంతో ముగుస్తుంది. గద్దెకు 20 కిలోమీటర్ల దూరంలోని దారపల్లి గ్రామంలో కొలువుదీరిన పెదసార్లమ్మ, కొటారిగొమ్ము గ్రామంలో కొలువు దీరిన చినసార్లమ్మ అమ్మవారులను పూజారులు సూత్రు పోతిరెడ్డి, అందెల లచ్చిరెడ్లు అర్యణ మార్గం మీదుగా డప్పువాయిద్యాలు, దేవార్ల పూనకాల మధ్య ఊరేగింపుగా కుమారుడు కొలువు దీరిన రేఖపల్లి గద్దె వద్దకు ఈ నెల 13న జాతరలో భాగంగా తోడ్కొని తీసుకురానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గద్దె వద్ద కుమారుడు పోతురాజు ఉన్న అమ్మవార్ల ప్రతిమలను ఉంచి ప్రధాన పూజారి సారా పాండురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పేరుకు గిరిజనుల జాతరే అయినప్పటికీ జాతరకు సమీప మండలాల నుంచి అన్ని వర్గాల ప్రజలు వేల సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే జాతరను పురస్కరించుకొని సమీప క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

జాతర చరిత్ర

కొర్రాజుల జాతర ప్రాశస్త్యం గురించి గ్రామ పెద్దలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. పాండవుల అరణ్యవాస సమయంలో అడవుల్లో సంచరిస్తూ ఇక్కడ ప్రాంతం చేరుకునే సమయానికి ఇక్కడ నివసిస్తున్న కొండరెడ్డి, నాయపోడు గిరిజనులు వారికి తారసపడ్డారు. అనంతరం వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. దీంతో పాండవులు కొంతకాలం ఇక్కడ నివసించారు. ఆ కాలంలో స్థానిక గిరిజనులకు ఎలాంటి ఆపదలు లేకుండా పాండవులు కాపాడారని అందువల్లే తమ గిరిజన జాతులు మనుగడ కొనసాగించబడిందని ఈ ప్రాంతంలో ఉన్న పూర్వీకులు విశ్వస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా పాండవులను కొర్రాజులుగా నామకరణ చేసి ప్రతీ మూడేళ్ల కొకసారి రేఖపల్లిలో కొర్రాజుల కొలువుల జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.


అగ్ని గుండం వద్ద అమ్మవార్ల మాలధారులు(ఫైల్)

అరిష్టాలు తొలిగించేందుకు

జాతర చివరి రోజు అమ్మవారి మాలధారులు అగ్ని గుండ ప్రవేశిస్తారు. అనంతరం వివిధ మానసిక రుగ్మలతో బాధపడుతున్న బండారు(పసుపు)బొట్టు పెట్టి, వీరతాడుతో కొట్టి దెయ్యాలను పామ్మని దేవుని వాక్కులు పలుకుతారు. అలా చేయడం వల్ల గ్రామానికి అరిష్టం ఉండదని, భూత, ప్రేత్మాతలు భవిష్యత్‌లో రాకుండా పారిపోతాయని భక్తులు విశ్వసిస్తారు.

అగ్నిగుండం తొక్కేందుకు ఉత్సాహం

జాతరలో ఏర్పాటు చేసిన కొండాలు(అగ్నిగుండాన్ని) ఒక్కసారి తొక్కితే చాలని, కుటుంబం అంతటికి మేలు జరుగుతుందని ఇక్కడి నమ్మకం. దీంతో అగ్నిగుండాన్ని తొక్కేందుకు జాతరకు వచ్చే వారందరూ పోటీ పడడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవ కమిటీ సభ్యులు జాతరకు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు, కమిటీ సభ్యులు తెలిపారు.


అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు(ఫైల్)

పాఠశాలలకు చేరిన విద్యాకానుకలు


రాజవొమ్మంగి విద్యావనరుల కేంద్రానికి వచ్చిన యూనిఫాం క్లాత్ బండిల్స్


రాజవొమ్మంగి విద్యావనరుల కేంద్రంలో పుస్తకాల స్టాక్

జగనన్న ఇచ్చిన హామీలతో విద్యార్థులకు మేలు

రాజవొమ్మంగి: విద్యార్థుల కోసం బాటలు పూల బాటలు అవుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే అవసరాలకు మించి ఆయా పాఠశాలకు చేరిన యూనిఫాంలు, నోట్స్‌బుక్స్, టెక్ట్స్ బుక్స్ ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు పాఠశాలలు తెరచి రెండు మూడు నెలలు గడచినా పిల్లలకు అవసరమైన పూర్తి స్థాయి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పాఠశాలలకు చేరేవి కావు. గత ఐదేళ్ల కాలంలో విద్యా సంస్కరణలతో పాఠశాలల్లో ఎన్నడూ లేనంతగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొన్నాయి. నేటి తరం పిల్లలకు ఎంతో మేలు జరిగింది.

97 పాఠశాలల్లో 4, 944 మంది పిల్లలు

2024–25 విద్యాసంవత్సరానికి చెంది మండలంలోని 97 పాఠశాలల్లో ఇప్పటికే 4, 944 మంది ఎన్‌రోల్ అయినట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. వీరిలో 2,616 మంది బాలికలు కాగా 2, 328 మంది బాలురు ఉన్నట్టు పేర్కొన్నారు.

పాఠశాలలకు చేరిన యూనిఫాంలు

రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా గల 97 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రెండు జతలకు సరిపడే యూనిఫాం క్లాత్ వచ్చినట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి బుధవారం తెలిపారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి అవసరానికి సరిపడా మండలానికి 28, 828 నోట్ పుస్తకాలు వచ్చినట్టు తెలిపారు.

34,098 పాఠ్యపుస్తకాలు సిద్ధం

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే పిల్లల కోసం 12,392 పాఠ్యపుస్తకాలు, 6, 7వ తరగతి విద్యార్థులకు– 3,618 మరియు 8, 9,10 తరగతుల విద్యార్థుల కోసం– 18, 088 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు ఎంఈఓ సూరయ్యరెడ్డి చెప్పారు. పాఠశాలలు తెరవగానే ఇస్తామన్నారు.

ఘనంగా నల్లకొండమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణతో అమ్మవారు


ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హోమం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రధమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాతవరంలో పూర్వం నుంచి గ్రామస్తులు శ్రీనల్లకొండమ్మ తల్లిని గ్రామ దేవతగా ఆరాధిస్తున్నారు. ఆలయం లేకపోవడంతో చెట్టు వద్ద అమ్మవారిని పూజించేవారు. దేవాలయాలను నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రోత్సహించింది. దీంతో నాతవరంలో శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ నిధులు మంజూరు చేశారు. ఈనిధులతో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సంయుక్తంగా అమ్మవారిని ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. గత ఏడాది జూన్ 12న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, మంత్రులు, కలెక్టరు ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. మధ్యాహ్నం అన్నసమారాధన, కోలాటం, భజన కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు


గ్రోమోర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ హెచ్చరించారు. స్థానిక లైసెన్స్ ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకాణాల వద్ద విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణాల యజమానులకు ఏవో సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు 100 గింజలు తీసుకుని ముందుగా మొలక శాతం కట్టాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన దుకాణాల్లో విత్తన బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ శాంపిల్ విత్తనాలను క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు పంపిస్తామని ఆమె చెప్పారు. ఎక్కడైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, విత్తనాల నాణ్యత లోపించినా తమకు పిర్యాదు చేయాలని కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్ కుమార్ తదితరులున్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తేనే అభివృద్ధి


మాట్లాడుతున్న జడ్జి స్వర్ణ

చోడవరం రూరల్: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపితేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ తెలిపారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ హోటళ్లు, వ్యాపార సంస్థలు, చిన్నపాటి పరిశ్రమలు, కర్మాగారాలలో పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా తీవ్ర నేరమన్న సంగతి ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఎవరైనా బాలలతో పనులు చేయిస్తున్నట్టయితే వారికి ఈ విషయం తెలియపరచి, పనుల్లో ఉన్న పిల్లలకు విముక్తి లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేస్తే బాల కార్మిక వ్యవస్థను రూపుమాపగలమన్నారు. సహాయ కారిృక అధికారి పి.సూర్యనారాయణ, వెనుకబడిన తరగతుల సంక్షేమ గృహం వార్డెన్ జె.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

1000 లీటర్ల సారా పులుపు ధ్వంసం

పాయకరావుపేట : పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో మంగళ, బుధ వారాలు దాడులు నిర్వహించి 1000 లీటర్లు నాటు సారా కాపునకు ఉపయోగించే బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. నక్కపల్లి మండలం గుల్లిపాడు పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 400 లీటర్లు బెల్లం పులుపును ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా మంగవరం గ్రామ సమీపాన గల ఆవ ప్రాంతంలో దాడులు నిర్వహించి మరో 600 లీటర్లు సారా కాపు పులుపును ధ్వంసం చేసినట్టు తెలిపారు. పాయకరావుపేట నుంచి గోపాలపట్నం అక్రమంగా తరలిస్తున్న 10 మద్యం బాటిళ్లను రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసును నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు


వరి విత్తనాల స్టాకు

రాంబిల్లి: రైతులకు పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో పలు ఆర్‌బీకేలకు 138 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చినట్లు ఏవో ఎ.సుమంత తెలిపారు. బీపీటీ రకంతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలు మాత్రం గురువారం వస్తాయని ఏవో పేర్కొన్నారు. ఈ విత్తనాలను మొలక కట్టి మొలక శాతం పరీక్షించిన తర్వాతే రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా మోదమ్మ అంబలం పూజ


కె.జె.పురంలో మోదమ్మ అంబలం పూజలో పాల్గొన్న మాలాధారణ భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో మంగళవారం రాత్రి మోదమ్మ అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక మోదమాంబ మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భజన చేశారు. ఈ కార్యక్రమంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.